క్లుప్తంగా

రేపు గోదాదేవి కల్యాణం

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక హౌసింగ్ బోర్డులోని శ్రీలక్ష్మీ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకం అలంకరిస్తామని పేర్కొన్నారు. అలాగే ఉదయం 10 గంటలకు గోదాదేవి కల్యాణోత్సవం, అనంతరం ప్రసాద వినియోగం ఉంటుందని వివరించారు.

గుండెపోటుతో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ మృతి



కౌన్సిలర్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : బద్వేలు మున్సిపాలిటీ 11వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ కమ్మోళ్ల శ్రీదేవి (45) శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెందారు. బద్వేలు మున్సిపాలిటీ 11వ వార్డుకు ఏకగ్రీవంగా ఎన్నికైన కమ్మోళ్ల ప్రభాకర్ 2021 మే 11వ తేదీన కరోనాతో మృతిచెందడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. అదే ఏడాది నవంబర్ 15న జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి శ్రీదేవి 889 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

ఎమ్మెల్యే నివాళి

కౌన్సిలర్ శ్రీదేవి గుండెపోటుతో మృతిచెందారన్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ కౌన్సిలర్ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి

ప్రొద్దుటూరు: పట్టణంలో పారిశుద్ధ్యంపై సిబ్బంది దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో శనివారం కమిషనర్ పర్యటించారు. స్థానిక మైదుకూరు రోడ్డులోని ఎస్‌పీజీ చర్చి వద్ద ఉన్న చెత్త పాయింట్‌ను పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయించారు. రామేశ్వరంలోని కొత్తపల్లె కెనాల్‌లో చెత్త వేస్తున్నారని అక్కడి ప్రజలు ఫిర్యాదు చేయగా అక్కడికి వెళ్లి పరిశీలించారు. కెనాల్‌లోని చెత్తను పారిశుద్ధ్య కార్మికులతో తొలగించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.గోవిందరెడ్డి పాల్గొన్నారు.

బీసీ, ఈబీసీలకు రాయితీ రుణాలు

పోరుమామిళ్ల: బీసీ, ఈబీసీ వర్గాలు బీసీ కార్పొరేషన్ ద్వారా బ్యాంక్ లింకేజీతో రాయితీ రుణాలు పొందవచ్చని శనివారం ఎంపీడీఓ రమణారెడ్డి తెలిపారు. బ్యాంక్ లింకేజీతో రూ. 2,3,5 లక్షలు పొందవచ్చన్నారు. జనరిక్ మెడికల్ షాపు పెట్టుకునేందుకు రూ. 8 లక్షలు రుణ సౌకర్యం ఉందని, అందులో 50 శాతం రాయితీ ఉంటుందని చెప్పారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 16 వరకు గడువు ఉందన్నారు. ఓబీఎంఎంఎస్ సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రక్త వర్గ, హిమోగ్లోబిన్ పరీక్షలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వైవీఎస్ మున్సిపల్ గర్ల్స్ హైస్కూల్‌లో శనివారం సర్ సీవీ రామన్ సైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు రక్త వర్గ, హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు వంశీకృష్ణ, సెక్రటరీ అల్లాబకాష్ మాట్లాడుతూ మంచి సమతుల ఆహారం తీసుకుని హిమోగ్లోబిన్ పెంచుకోవాలని తెలిపారు. ఆరోగ్యవంతులకు 14–17 శాతం వరకు హిమోగ్లోబిన్ ఉంటుందని, 9 శాతం కంటే తక్కువ ఉంటే అనీమియాతో బాధపడుతారని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణాలను కాపాడాలని సూచించారు. టెక్నీషియన్ శ్రీకాంత్, గోపినాథ్‌రెడ్డి, రవి ప్రకాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి కృషి

పోరుమామిళ్ల: ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. బస్టాండులో నీరు సరఫరా చేసే మోటర్ చెడి పోవడం వలన మూడు రోజులుగా మరుగుదొడ్లకు నీరు సరఫరా ఆగిపోయింది. నీళ్లు లేక మరుగుదొడ్లకు తాళం వేశారని తెలుసుకున్న రవిప్రకాష్‌రెడ్డి శనివారం బస్టాండు వచ్చి పరిశీలించారు. ఆర్టీసీ కంట్రోలర్స్ జమాల్, నాగరాజు మోటార్ రిపేరుకు ఇచ్చినట్లు చెప్పారు. మదర్ థెరెసా ఫౌండేషన్ ట్రస్టీ గిరిప్రణీత్‌రెడ్డి ద్వారా ట్యాంకర్ ఏర్పాటు చేయించి నీటి సమస్యను రవిప్రకాష్‌రెడ్డి పరిష్కరించారు.

భక్తిశ్రద్ధలతో కుడారై వెల్లుం శీర్ గోవిందా

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాతమార్కెట్‌లోని రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస పూజలో భాగంగా శనివారం తిరుప్పావైలోని 27వ పాశురమైన కుడారై వెల్లుం శీర్‌గోవిందా పఠనం చేశారు. తెల్లవారుజామున శ్రీదేవిభూదేవి సమేత రతనాల వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం 5 గంటలకు దీపాలు పట్టుకుని భక్తిగీతాలు ఆలపిస్తూ, గోవింద నామాలు పఠించారు. మహిళలు ముగ్గులు వేసి దీపాలు వెలిగించారు.

నిప్పు.. భూసారానికి ముప్పు

నిప్పు.. భూసారానికి ముప్పుగా మారుతోంది. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటల నూర్పిళ్ల అనంతరం వ్యర్థాలకు రైతులు నిప్పు పెడుతున్నారు. దీంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపడంతో పాటు రానున్న రోజుల్లో పంటలు పండని దుస్థితి ఏర్పడే ప్రమాదం ఉంది. కాల్చడం వలన భూమి బిగువుగా మారి, నీటిని పీల్చుకునే గుణాన్ని కోల్పోయే అవకాశం ఉంది. కాల్చిన చోట భూమి సేంద్రియ పదార్థాన్ని కోల్పోతుంది.

- పంట వ్యర్థాలను కాల్చితే భూమికి నష్టం
- భూసారాన్ని దెబ్బతీస్తున్న రైతుల ఆలోచనలు
- పొలంలో కలియదున్నితేనే మేలు



మినుము పంట నూర్పిడి అనంతరం నిప్పు పెట్టిన రైతులు

రాజుపాళెం: రాజుపాళెం మండలంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన వరి, మినుము, పెసర, మొక్కజొన్న పంటల నూర్పిళ్లు పూర్తయ్యాయి. నెల రోజులుగా యంత్రాలు, కూలీల ద్వారా కోతలు, నూర్పిడిలు ముమ్మరంగా సాగాయి. అయితే రెండో పంట సాగు చేసేందుకు రైతులు అదే పొలంలో సిద్ధం చేసేందుకు పంట వ్యర్థాలు అడ్డంకిగా నిలుస్తున్నాయి. పాడి పశువులు ఉన్న కొంతమంది రైతులు అయితే వరి గడ్డిని, మినుము పొట్టును ఇంటికి వివిధ రూపాల్లో తరలిస్తున్నారు. కానీ పాడి లేని రైతులు ఆ గడ్డిని, పొట్టుకు పొలాల్లోనే నిప్పు పెడుతున్నారు. రైతులు తీసుకుంటున్న ఈ నిర్ణయం కారణంగా వారికి తెలియకుండానే భూసారాన్ని నాశనం చేస్తున్నారని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

యంత్రాల కోతలు జరిగిన పొలాల్లోనే..

మండలంలోని పలు గ్రామాల్లో దాదాపు 22 వేల ఎకరాల్లో ఈ పంటలను సాగు చేశారు. నూర్పిళ్లు జరిగిన పొలాల్లో వ్యర్థాలకు నిప్పు పెడుతున్నారు. యంత్రాలు, కూలీల ద్వారా కోత కోసిన తర్వాత ధాన్యం ఇంటికి చేరుకోగా పంట వ్యర్థాలు పొలం నిండా పరుచుకుంటుంది. రబీలో పంట వేయాలంటే దుక్కి, దమ్ము చేసేందుకు వ్యర్థాలు లేకుండా చేయాలి. ఆ గడ్డిని ఒకచోటకు చేర్చి కుప్ప పెట్టాలంటే రైతులకు ఖర్చుతో కూడుకున్న పని. దీంతో గడ్డికి నిప్పు పెట్టి రబీ పంటలను వేసుకుంటున్నారు.

మిత్ర పురుగులకు హాని

రైతులు తీసుకుంటున్న నిర్ణయం కారణంగా రైతులకు మేలు చేసే మిత్ర పురుగులు అంతరించి పోతున్నాయని వ్యవసాయశాఖ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. పొలంలో పరుచుకున్న గడ్డిని కాల్చడం వలన భూమి పైపొరల్లో ఉండే మిత్ర పురుగులు వేడికి నాశనం అవుతున్నాయి. భూమిలో ఉండే వానపాములు, ఇతర శిలీంద్రాలు అంతరించి పోవడం వలన భూమికి నష్టం జరుగుతుందని తెలియజేస్తున్నారు. నూర్పిళ్ల అనంతరం కొర్ర, నువ్వు, కుసుమ, గరిగె, వరి పంటలను సాగు చేస్తున్నారు. ఇప్పటికే పొలాలకు నీటి తడులు అందించి విత్తనం వేస్తున్నారు. పొలాల్లో నిప్పు పెట్టిన చోట విత్తనం మొలక రాలేదని రైతులు అంటున్నారు. పంట పొలాల్లో నిప్పు పెట్టడం వల్ల తీవ్ర నష్టాలుంటాయని అధికారులు వివరిస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



పొలంలో పంటల వ్యర్థాలకు నిప్పు పెట్టడం వలన భూమి పొరల్లో ఉన్న శిలీంద్రాలు ఇతర సూక్ష్మజీవులు, మిత్ర పురుగులు నశించి పోతాయి. యంత్రాలతో కోత కోసిన తరువాత వ్యర్థాలను ఒక చోట చేర్చి అవి కుళ్లేలా చేయడం వలన సేంద్రీయ ఎరువు తయారవుతుంది. ఆ ఎరువును పొలానికి వాడుకోవచ్చు. వ్యర్థాలకు నిప్పు పెట్టకుండా ఉండాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– శివరామ కృష్ణారెడ్డి, ఏఓ, రాజుపాళెం

మాధవరాయస్వామి ఆలయం.. ఉత్సవ శోభితం

- రేపటి నుంచి సంక్రాంతి వేడుకలు
- 16 రోజుల పాటు పార్వేట



శ్రీలక్ష్మీ మాధవరాయస్వామి ఆలయం

మైదుకూరు : మైదుకూరులోని శ్రీలక్ష్మీ మాధవరాయస్వామి ఆలయంలో సోమవారం నుంచి సంక్రాంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. శ్రీలక్ష్మీ మాధవరాయ స్వామి గండికోట నుంచి కొన్ని కారణాల వలన మైదుకూరులో వెలసినట్లు చెబుతారు. కనుమ పండుగ రోజున నిర్వహించే పార్వేట ఉత్సవం.. అశేష భక్తుల మధ్య శ్రీలక్ష్మీ మాధవరాయస్వామి గ్రామోత్సవం ఎంతో ఘనంగా నిర్వహిస్తారు. అనంతరం మైదుకూరు పరిసర గ్రామాల్లో 16 రోజుల పాటు శ్రీలక్ష్మీ మాధవరాయస్వామి పార్వేట కార్యక్రమాలు జరుగుతాయి. అనంతరం తిరిగి మైదుకూరు చేరుకునే స్వామికి కనుల పండువగా విజయోత్సవాన్ని నిర్వహిస్తారు.

ఘనంగా ఏర్పాట్లు

ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు శనివారం ఆలయ చైర్మన్ బండిబెల్లం సుబ్బరాయుడు విలేకరుల సమావేశంలో చెప్పారు. 13న సోమవారం భోగి పండుగ రోజు ప్రత్యేక పూజలతోపాటు సాయంత్రం గజ వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత మాధవరాయస్వామికి గ్రామోత్సవాన్ని నిర్వహిస్తామని తెలిపారు. మకర సంక్రాంతి రోజున ఉభయదారులతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయని, సాయంత్రం హనుమ వాహనంపై స్వామికి గారమోత్సవాన్ని నిర్వహిస్తారన్నారు. ఆలయ మాజీ చైర్మన్ రామ్మోహన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆలయ చైర్మన్ సుబ్బరాయుడు

సంస్కృతి, సంప్రదాయాల కలయికే సంక్రాంతి



సీఐ బాలమద్దిలేటిని సత్కరిస్తున్న బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : దేశ సంస్కృతి, సంప్రదాయాల చిహ్నమే సంక్రాంతి అని రూరల్ సీఐ బాల మద్దిలేటి పేర్కొన్నారు. మండల పరిధిలోని సాయి రాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాలలో సంక్రాంతి సంబరాలను అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు భారతీయ సంస్కృతి సంప్రదాయాలు పాటించాలని సూచించారు. కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి మాట్లాడుతూ తెలుగు వారికి సంక్రాంతి ఎంతో ప్రాముఖ్యమైన పండుగ అని మూడు రోజులపాటు జరిగే ఈ పండుగలో అన్ని వర్గాలకు ప్రాధాన్యత ఉందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీలు, వంటల పోటీలు, గాలిపటాల పోటి, కోలాటం, వస్త్రాలంకరణ, చెక్కభజన, ఫొటోగ్రఫీ, చిత్రలేఖనం, బొంగరాలు, హరిదాసు కీర్తనలు అందరిని ఆకట్టుకున్నాయి. కళాశాల కరస్పాండెంట్ వీర కల్యాణ్ రెడ్డి, ప్రిన్సిపాల్ పాండురంగన్ రవి, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

కళాక్షేత్రం ఏర్పాటుకు కృషి

–ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణంలో వ్యాపార వాణిజ్యాలతో పాటు సాహిత్యం కళలకు ప్రసిద్ధి చెందిందని, కళాకారుల కోసం కళాక్షేత్రం ఏర్పాటు చేయడానికి కృషిచేస్తానని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలో జరుగుతున్న రాయలసీమ స్థాయి సంగీత నృత్యోత్సవాల్లో శనివారం రాత్రి జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కేంద్ర సంగీత నాటక అకాడమి రాష్ట్రపతి అవార్డు గ్రహీత డాక్టర్ వేదాంతం రాధేశ్యాం మాట్లాడుతూ ప్రొద్దుటూరు పట్టణం తనకు విద్యాబుద్ధులు నేర్పించిందన్నారు. గీతాశ్రమంలోని పండిత కళాశాల గురువులు తన నాట్యానికి సంతోషపడి కళాశాలలో చదువుకోవడానికి అవకాశం కల్పించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎస్‌వీ సంగీత నృత్య కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ జమునా రాణి, నటరాజ కళాక్షేత్రం నాట్యగురువు ఖాజామొహిద్దీన్, ఈఓ రామచంద్రాచార్యులు, నాట్యగురువులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు కళల్లో రాణించాలి

విద్యార్థులు, యువత చదువుతో పాటు కళల్లో రాణించాలని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలో శనివారం నటరాజ కళాక్షేత్రం ఆధ్వర్యంలో రాయలసీమ సంగీత నృత్యోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తాం



మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డితో భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి

ప్రొద్దుటూరు: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేసామని ఆ పార్టీ ప్రొద్దుటూరు పట్టణాధ్యక్షుడు భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి తెలిపారు. ప్రొద్దుటూరు 32వ కౌన్సిలర్ వంశీధర్‌రెడ్డిని ఆ పార్టీ అధిష్టానం ప్రొద్దుటూరు పట్టణాధ్యక్షుడిగా నియమించింది. ఈ సందర్భంగా ఆయన శనివారం మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సహకారంతో తనను పట్టణ అధ్యక్షుడిగా నియమించినట్లు తెలిపారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఖాజీపేట: వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌గా మురళీమోహన్‌రెడ్డిని నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ అధ్యక్షులు రవీంద్రనాథరెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. పార్టీకి పూర్వవైభవం తెస్తామని ప్రకటించారు.



మురళీమోహన్‌రెడ్డి

దువ్వూరు (చాపాడు): వైఎస్సార్‌సీపీ దువ్వూరు మండల కన్వీనర్ ఇరగంరెడ్డి శంకర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కన్వీనర్‌గా తనకు బాధ్యతలు అప్పగించడం పట్ల పార్టీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, వ్యవసాయ శాఖ మాజీ ప్రభుత్వం సలహాదారుడు తిరుపాల్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.



ఇరగంరెడ్డి శంకర్‌రెడ్డి

చాపాడు: వైఎస్సార్‌సీపీ చాపాడు మండల కన్వీనర్‌గా చాపాడుకు చెందిన చాపాటి రాజశేఖర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి మండల కన్వీనర్‌గా విధులు నిర్వహిస్తున్నానని తెలిపారు. తన పదవికి కారకులైన మాజీ సీఎం వైఎస్ జగన్, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.



చాపాటి రాజశేఖర్‌రెడ్డి

▶▶ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుల నియామకం

బద్వేలు అర్బన్: వైఎస్సార్‌సీపీ బద్వేలు మున్సిపాలిటీ అధ్యక్షుడుగా గుర్రంపాటి సుందర్ రామిరెడ్డి, బద్వేలు మండల అధ్యక్షుడుగా పోకలమల్లేశ్వర్ రెడ్డిలను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ నియామకానికి సహకరించిన ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలకు కృతజ్ఞతలు తెలిపారు.



జి.సుందర్‌రామిరెడ్డి



పి.మల్లేశ్వర్‌రెడ్డి

కాశినాయన: కాశినాయన మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడుగా గుండం హనుమంత రెడ్డిని నియమిస్తూ పార్టీ అధిష్టానం కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. తనపై నమ్మకంతో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షునిగా నియమించినందుకు ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలకు కృతజ్ఞతలు తెలియజేశారు.



గుండం హనుమంతరెడ్డి

గోపవరం: వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడుగా రాచాయపేట గ్రామానికి చెందిన చల్లా రవిచంద్రారెడ్డిని ఆ పార్టీ అధిష్టానం నియమించింది. ఈ సందర్భంగా రవిచంద్రారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు తనపై నమ్మకంతో మండల పార్టీ అధ్యక్షుడుగా నియమించారని, పార్టీ కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు.



చల్లా రవిచంద్రారెడ్డి

అట్లూరు: వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌గా ముడమాల ప్రభాకర్‌రెడ్డిని నియమిస్తూ ఆ పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ అవినాష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



ముడమాల ప్రభాకర్‌రెడ్డి

ప్రశాంతంగా ముగిసిన రేషన్ డీలర్ల రాతపరీక్ష



పర్యవేక్షిస్తున్న ఆర్డీఓ చంద్రమోహన్

బద్వేలు అర్బన్: బద్వేలు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న 155 చౌకదుకాణ డీలర్ పోస్టుల భర్తీకి శనివారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన దరఖాస్తుదారుల రాత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. బద్వేలు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న 155 చౌకదుకాణాల డీలర్ల భర్తీ కోసం గతేడాది డిసెంబర్ 24న నోటిఫికేషన్ జారీ చేయగా డివిజన్ పరిధిలోని ఆయా మండలాల నుంచి 288 మంది దరఖాస్తు చేసుకున్నారు. శనివారం నిర్వహించిన రాత పరీక్షకు 260 మంది హాజరయ్యారు. రాతపరీక్షను ప్రశాంతంగా పకడ్బందీగా నిర్వహించామని ఆర్డీఓ ఎ.చంద్రమోహన్ తెలిపారు.

బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

రాజుపాళెం: మండలంలో ఎవరైనా బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాజుపాళెం ఎస్‌ఐ కత్తి వెంకటరమణ పేర్కొన్నారు. ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా మద్యం విక్రయిస్తున్నట్లు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

30 మద్యం బాటిళ్లు స్వాధీనం

వెంగలాయపల్లె వద్ద మద్యం తరలిస్తున్న వ్యక్తిని శనివారం పట్టుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. రాజుపాళెం గ్రామానికి చెందిన దుబ్బోల బ్రహ్మయ్య వద్ద నుంచి వెంగలాయపల్లె వద్ద 30 బాటిళ్లను స్వాధీనం చేసుకొని, కేసునమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఒంటి గంట వరకు ఓపీ నిర్వహించాలి

ప్రొద్దుటూరు క్రైం: జిల్లా ఆస్పత్రిలో మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓపీ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బండ్ల జయరాజ్ తెలిపారు. శనివారం జిల్లా ఆస్పత్రిని పరిశీలించిన ఆయన అనంతరం మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం జిల్లా ఆస్పత్రిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓపీ నిర్వహించాల్సి ఉండగా ఇక్కడ మధ్యాహ్నం 12 గంటలకే ఓపీ ముగుస్తుందని చెప్పారు. ప్రొద్దుటూరుతో పాటు జమ్మలమడుగు, మైదుకూరు, వేంపల్లె, నంద్యాల జిల్లాలోని చాగలమర్రి మండలాల నుంచి వైద్యం కోసం జిల్లా ఆస్పత్రికి వస్తుంటారని తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, మండల అధ్యక్షుడు ఎం పుల్లయ్య, పట్టణ ఉపాధ్యక్షుడు మనేష్ పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీనరసింహస్వామికి పంచలోహ కవచం వితరణ



లక్ష్మీనరసింహస్వామికి పంచలోహ కవచం వితరణ చేస్తున్న దాతలు

గోపవరం : వల్లెరవారిపల్లెలో కొలువైన శ్రీలక్ష్మీనరసింహస్వామికి అదే గ్రామానికి చెందిన దివంగత నల్లెంనరసింహులు, ఆయన సతీమణి లక్ష్మీనరసమ్మ, వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో రూ.1.30 లక్షలు విలువ చేసే పంచలోహ కవచం (తొడుగు) వితరణ చేశారు. శనివారం వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య స్వామివారికి కలశ సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించి అలంకరించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

రోడ్లు ధ్వంసం.. ఒళ్లు హూనం

ఖాజీపేట: సంక్రాంతికి రోడ్లు అన్నీ బాగుండాలి.. ఎక్కడా గుంత కనిపించకూడదని సీఎం చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. సంక్రాంతి సమీపిస్తున్నా రోడ్లకు మోక్షం కలుగలేదు. ఖాజీపేట మండలంలో పలు గ్రామాలను కలిపే అంతర్గత రోడ్లు ధ్వంసమయ్యాయి. ఖాజీపేట టీచర్స్‌కాలనీ నుంచి బీసీ కాలనీ వరకు వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. అలాగే టీచర్స్‌కాలనీ నుంచి సుంకేసులకు వెళ్లే రోడ్డులో కూడా గుంతలు ఏర్పడి వాహనదారులు నరకం అనుభవిస్తున్నారు. రోడ్లపై రాళ్లు తేలి గుంతలమయమయ్యాయి. ఆ రోడ్లపై వెళ్లాలంటే వాహనదారుల ఒళ్లు హూనం కాకతప్పదు. అతుకుల రోడ్లపై ప్రయాణం చేయడం వలన వాహనాలు దెబ్బతింటున్నాయి. గతుకుల రోడ్లపై రాకపోకలు సాగించలేక జనం పడుతున్న వ్యథలెన్నో.దీనికితోడు రోడ్డును కంపచెట్లు కమ్మేశాయి. మలుపుల వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నారు.



సుంకేశుల- ఖాజీపేట రహదారిపై తేలిన కంకర



రోడ్డును కమ్మేసిన కంపచెట్లు



టీచర్స్ కాలనీ నుంచి బీసీ కాలనీకి వెళ్లే సీసీ రోడ్డుపై గుంతలు